TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 358 | సోమవారం 4-08-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.

## భార్యను రికార్డుల్లో చంపేసిన భర్త

**తాను పోయాక వితంతు పింఛన్ అందకూడదనే**

**పట్నా, ఆగస్టు 3:** తాను చనిపోతే భార్యకు వితంతు పింఛను రాకూడదన్న ఉద్దేశంతో ఓ వ్యక్తి ఆమెను రికార్డుల్లో చంపేశాడు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సమయంలో ఈ విషయం బయటపడింది. ఓటర్ల జాబితా సవరణ కోసం అధికారులు పట్నా రూరల్ నియోజకవర్గం ధనరువా గ్రామంలోని శివరంజన్ కుమార్ ఇంటికి వెళ్లగా అక్కడ ఆయన భార్య నిషా కుమారి కనిపించింది. కానీ, 3 నెలల క్రితం చనిపోయినట్టు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. డెత్ సర్టిఫికెట్ కూడా జారీ అయింది. అధికారులు ఈ విషయమే ఆమెతో చెప్పారు. దీంతో, తన డెత్ సర్టిఫికెట్ కోసం ఎవరు దరఖాస్తు చేశారో వివరాలు వెల్లడించాలంటూ నిషా కుమారి బీడీఓకు అప్లికేషన్ సమర్పించారు. భర్త శివరంజన్ కుమారే అలా చేశాడని తేలింది. ఎందుకని ప్రశ్నిస్తే.. "నా భార్యకు నాకు పడట్లేదు. నేను చనిపోతే పెన్షన్ రావొద్దనే అలా చేశాను" అని శివరంజన్ సమాధానం ఇచ్చాడు.

## అసహజ మరణాల రికార్డులు ధ్వంసం

**ధర్మస్థళ కేసులో పోస్టుమార్టం నివేదికలు, ఫొటోలూ మాయం**

**సిట్‌ను ఆశ్రయించిన సమాచార హక్కు కార్యకర్త జయంత్**

**బెంగళూరు, ఆగస్టు 3:** కర్ణాటకలోని ధర్మస్థళలో అనేకమంది మహిళలు, బాలికల మృతదేహాలను చట్టవిరుద్ధంగా ఖననం చేసిన కేసులో మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. 2000 సంవత్సరం నుంచి 2015 సంవత్సరం వరకు నమోదైన అసహజ మరణాల రికార్డులు మాయమవడం తాజాగా కలకలం రేపుతోంది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కార్యకర్త జయంత్ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా ఈ విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఆ 15 సంవత్సరాల కాలంలో జరిగిన అసహజ మరణాలకు సంబంధించిన రికార్డులు కావాలంటూ జయంత్ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా కోరగా, 2000–2015 మధ్య యూడీఆర్(అసహజ మరణాల రిజిస్టర్)లో నమోదైన మరణాలకు సంబంధించిన అన్ని పత్రాలు, పోస్టుమార్టం నివేదికలు, వాల్‌పోస్టర్లు, నోటీసులు, గుర్తుతెలియని మృతదేహాల గుర్తింపు కోసం తీసిన ఫొటోలను సాధారణ పరిపాలన పరమైన ఆదేశాల మేరకు ధ్వంసం చేశామని బెల్తంగాడి పోలీసులు సమాధానం ఇచ్చినట్టు జయంత్ తెలిపారు.

# కాళేశ్వరంపై సిట్?

## అవకతవకలపై విచారణకు ప్రత్యేక బృందం.. అసెంబ్లీలో చర్చ

**నేటి మంత్రివర్గ భేటీలో సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం..**



**హైదరాబాద్, ఆగస్టు 3:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించనుందని సమాచారం. ఇదే అంశంపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలను కూడా నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. తెలంగాణకు వరంగా గత సర్కారు అభివర్ణించిన కాళేశ్వరం.. ప్రజాధనం వృథా చేసిన ప్రాజెక్టుగా మారిందంటూ విచారణ కమిషన్ చెప్పిన వివరాలను ప్రజలకు వివరించేందుకు సర్కారు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంపై.. సోమవారం నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో చర్చించి, కీలక నిర్ణయం తీసుకోనుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కాళేశ్వరం అవకతవకలపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపైనే క్యాబినెట్ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే.. ఈ ప్రాజెక్టు అవకతవకల వెనుక ఉన్న రాజకీయ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అధికారులపై ఏ విధమైన చర్యలకు ఉపక్రమించాలనే విషయాలపైనా చర్చించనున్నారు. దాంతోపాటు.. శాసనసభ సమావేశాలు నిర్వహించి, సభ్యులందరికీ విచారణ కమిషన్ నివేదికను అందించి.. దానిపై చర్చ జరపాలనే యోచనలోనూ సర్కారు ఉన్నట్టు సమాచారం. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అసలేం జరిగిందనేది ప్రజలకు స్పష్టంగా తెలిసే అవకాశం ఉంటుందని భావిస్తోంది. కాగా కాళేశ్వరంపై విచారణ కోసం ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్ అందించిన నివేదికపై అధ్యయనానికి.. సాధారణ పరిపాలన, న్యాయ, సాగునీటి పారుదల శాఖల ముఖ్యకార్యదర్శులతో ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ ఆదివారం సాయంత్రం సచివాలయంలో భేటీ అయి చర్చించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిధుల ఖర్చు వ్యవహారంపై.. పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికలో పలు సిఫారసులు కూడా చేసింది. ఆ సిఫారసుల మేరకు నేరుగా చర్యలకు ఉపక్రమించాలా? లేక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలా? అనే అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చించి ఒక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అప్పటి సీఎం కేసీఆర్, మంత్రులు హరీశరావు, ఈటల పాత్రల గురించి వివరించిన కమిషన్.. అధికారుల ప్రమేయం, వారు నిర్వర్తించిన పాత్రల గురించి కూడా వివరించింది. ఈ నేపథ్యంలో కమిషన్ ప్రస్తావించిన అ?ధికారులపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించాలనేదానిపైనా కీలకంగా చర్చించనున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన అప్పటి ఈఎన్‌సీ మురళీధర్, హరిరామ్.. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇప్పటికే అరెస్టయ్యారు. అలాగే అప్పటి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్‌కే జోషీ, సీఎంవో అదనపు కార్యదర్శిగా వ్యవహరించిన స్మితా సభర్వాల్‌తో పాటు మరికొంత మంది అధికారులపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి కూడా ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాళేశ్వరం ఒక్క అంశంపైనే రాష్ట్ర మంత్రివర్గం సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది.

మిగతా 2లో...

## సర్కారు నిర్ణయాలపై ఏం చేద్దాం..?

- ఫాంహౌస్‌లో పార్టీ నేతలతో కేసీఆర్ భేటీ
- కాళేశ్వరం కమిషన్ నివేదికపై ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందన్న దానిపై చర్చ
- నేడు కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు వెళ్లనున్న బీఆర్ఎస్ నేతలు



**హైదరాబాద్/గజ్వేల్/ మహదేవపూర్, ఆగస్టు 3** కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతలపై సర్కారు క్రిమినల్ చర్యలు చేపట్టే అవకాశముందన్న ప్రచారం నేపథ్యంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్‌తో ముఖ్య నేతలు భేటీ అయ్యారు. ఆదివారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను మాజీమంత్రులు తన్నీరు హరీశ్ రావుతో పాటు పలువురు నేతలు కలిసినట్లు సమాచారం. కాళేశ్వరం కమిషన్ తన నివేదికలో పేర్కొన్న అంశాలేంటి? దాని ఆధారంగా రాష్ట్ర సర్కారు ఏవైనా చర్యలు తీసుకుంటే ఏం చేయాలన్న దానిపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. క్యాబినెట్ భేటీలో ఏం చర్చిస్తారు.. కాళేశ్వరం కమిటీ నివేదిక ఆధారంగా అధికారులు ఎటువంటి వివరాలను సిద్ధం చేశారు.. దాని ఆధారంగా క్యాబినెట్ ఎటువంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై వారు సమాలోచన చేసినట్లు సమాచారం. కేసీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌తో పాటు బాధ్యులందరిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని పీసీ ఘోష్ కమిషన్ సూచించినట్లయితే దాన్ని ఎదుర్కొనేందుకు ఏం చేయాలన్న దానిపై పార్టీ నేతలతో కేసీఆర్ చర్చలు జరిపినట్లు తెలిసింది.

## నాపై అనుచిత వ్యాఖ్యల వెనక పెద్ద నాయకుడు!

**ఇంటి ఆడబిడ్డనని చూడకుండా.. నా మీద నీచంగా వ్యాఖ్యలు చేయిస్తున్నారు**

**నేరుగా పేర్లు ప్రస్తావించకుండా కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలపై తీవ్ర విమర్శలు?**

**మీడియా సమావేశంలో ఆవేదన**



**హైదరాబాద్, ఆగస్టు 3:** బీఆర్ఎస్‌లోని పెద్ద నాయకుల తీరుపై కొన్ని నెలలుగా అసంతృప్తి వ్యక్తంచేస్తూ వస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరుగా పేర్లు ప్రస్తావించకుండా.. పరోక్షంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిలను ఉద్దేశించి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఓ పెద్ద నాయకుడు ఇంటి ఆడబిడ్డనని కూడా చూడకుండా తనపై నీచంగా, అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారని ఆరోపించారు. పెద్ద నాయకుడి అండతో సొంత పార్టీ నేతలే తనను ఇబ్బంది పెడుతున్నారని.. ఇవన్నీ ఆషామాషీగా చెప్పడం లేదని, ఆవేదనతో చెబుతున్నానని పేర్కొన్నారు. ఆ పెద్ద నాయకుడు తనపై చేస్తున్న కుట్రలు తిరిగి ఆయనకే తగులుతాయని వ్యాఖ్యానించారు. తన దగ్గర ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు మనుషులను పెట్టారన్నారు. నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని నాశనం చేసిన ఓ లిల్లీపుట్ నాయకుడు తన గురించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండి పడ్డారు. ఇటీవల జగదీశ్‌రెడ్డి ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవితను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పందిస్తూ కవిత ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో సంచలనం రేపుతున్నాయి. మీడియా సమా వేశంలో కవిత చేసిన వ్యాఖ్యలు ఆమె మాట ల్లోనే.. "ఇగ ఏం జెప్పాలన్నా.. నా బాధ.. కొందరు నాపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. ఒక ఆడబిడ్డగా భావించి యావత్ తెలం గాణ బాధపడింది. అనేకమంది ఎక్కడికక్కడ స్పంది ంచారు. ఏమైందో ఏమోగానీ.. బీఆర్ఎస్ పార్టీలోని అన్నదమ్ములు మాత్రం స్పందిం చలేదు. దీని వెనుక బీఆర్ఎసకు చెందిన పెద్ద నాయకుడు ఒకరి హస్తం ఉంది. అందుకే పార్టీ నాయకులెవరూ స్పందించలేదని బలంగా నమ్ముతున్నాను. ఆ కుట్రలు చేసిన పెద్ద నాయకులు నా దగ్గర ఒక పది మందిని పెట్టి.. నా చుట్టూ జరిగే అంశాల సమాచా రాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ చావు తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. కానీ, బాగా పెద్దగా ఉన్న నాయకుడికి అర్థం కావాల్సింది ఏమంటే.. అక్కడేం జరుగుతుందో కూడా నాకు సమాచారం వస్తూనే ఉంటుంది. మీరు ఏ సమయంలో ఎవరిని కలిశారు. నామీద వ్యాఖ్యలు చేయడానికి ఎవరిని ప్రోత్సహించారు...

## దేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత రంగం కీలకం

**అంతర్జాతీయ చేనేత హబ్‌గా రాష్ట్రం**

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు**



**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3:** భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత, వస్త్ర పరిశ్రమ కీలకమైన భాగమని, దీని ద్వారా దాదాపు 5 కోట్ల మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి లభిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శిల్పారామంలో జరిగిన చేనేత వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మేకిన్ ఇండియా కార్యక్రమం ద్వారా చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో ఏటేటా అభివృద్ధి చెందుతూ.. ప్రస్తుతం దేశ జీడీపీలో 2.3 శాతంగా ఉందని తెలిపారు. 2023–24లో ఈ రంగం ద్వారా రూ. 3 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయని, దీన్ని 2030 నాటికి రూ.9 లక్షల కోట్లకు పెంచాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. అందుకే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ),నేషనల్ హ్యాండ్లూమ్ డెవల్‌పమెంట్ ప్రాజెక్ట్ (ఎన్‌హెచ్‌డీపీ) ద్వారా నేతన్నలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని, వారికి అంతర్జాతీయ మార్కెటింగ్ సదుపాయాలతో పాటు మౌలిక వసతుల కల్పిస్తోందని చెప్పారు.

## తేజస్వికి ఈసీ నోటీసు

**పట్నా/న్యూఢిల్లీ, ఆగస్టు 3:** బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌కు ఎన్నికల కమిషన్ (ఈసీ) నోటీసు జారీచేసింది. ఆయన శనివారం చూపిన ఓటరు గుర్తింపు కార్డు అధికారికంగా జారీచేసింది కాదని.. దర్యాప్తు జరపడానికి వీలుగా దాని ఒరిజినల్ కార్డును తమకు అప్పగించాలని కోరింది. ఈ మేరకు పట్నా సదర్ సబ్‌డివిజినల్ మేజిస్ట్రేట్, దీఘా అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆయనకు ఆదివారం నోటీసు పంపారు. శనివారం బిహార్లో విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తన పేరు తొలగించారంటూ తేజస్వి పాత ఓటరు కార్డును మీడియా సమక్షంలో చూపారు. అయితే జిల్లా మేజిస్ట్రేట్ ఎస్ఎం త్యాగరాజ వెంటనే దీనిని ఖండించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్వి తన అఫిడవిట్‌లో పొందుపరచిన ఎపిక్ నంబరు అది కాదని.. ఆయన వద్ద రెండో ఓటరు కార్డు గనుక ఉంటే.. ఇది విచారణ జరపాల్సిన అంశమని తెలిపారు.

## రాష్ట్రపతిని వేర్వేరుగా కలిసిన మోదీ, అమిత్‌షా



న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఒకరి తర్వాత మరొకరు రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం నాడు సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్ వర్గాలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. అయితే, అగ్రనేతలిద్దరూ రాష్ట్రపతితో సమావేశం కావడానికి కారణమేమిటనేది తెలియలేదు. పీఎంవో కానీ, హోం శాఖ కార్యాలయం నుంచి గానీ ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధానమంత్రి ఆదివారం సమావేశమైనట్టు రాష్ట్రపతి భవన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. ఆ తర్వాత కొద్ది గంటలకే మళ్లీ రాష్ట్రపతి భవన్ మరో ట్వీట్‌లో హోం మంత్రి అమిత్‌షా రాష్ట్రపతిని కలుసుకున్నట్టు వెల్లడించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల యూకే, మాల్దీవుల్లో పర్యటనకు వెళ్లి వచ్చిన అనంతరం రాష్ట్రపతితో సమావేశం కావడం ఇదే మొదటిసారి.

## ఆపరేషన్ సింధూర్‌తో సత్తా చాటిన భారత్

**దేశీయంగానే డ్రోన్లు, క్షిపణుల అభివృద్ధి**

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**ఆపరేషన్ సిందూర్‌లో భాగస్వామ్యమైన రక్షణ రంగ శాస్త్రవేత్తలకు సత్కారం**




**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3:** ఆపరేషన్ సిందూర్‌తో భారతదేశ శక్తి, సామర్థ్యాలు ప్రపంచానికి మరోమారు తెలిశాయని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. స్వదేశీ క్షిపణులు, డ్రోన్లు, శక్తిమంతమైన ఎలక్ట్రానిక్ వార్ఫేర్, శత్రుదుర్భేద్యమైన రక్షణ వ్యవస్థ వినియోగంతో భారత్ తన శక్తి, స్థాయిని చాటిందన్నారు. భారత్ ఆర్థికంగా కుదేలైన దేశమని ప్రచారం చేస్తున్న వారికీ భారత్ సత్తా అతి త్వరలోనే అర్థమవుతుందని అమెరికా అధ్యక్షుడిపై ధ్వజమెత్తారు. హైదరా బాద్‌లో ఆదివారం జరిగిన 'ఆపరేషన్ సిందూర్‌లో భాగస్వామ్యం వహించిన సైనికులకు, శాస్త్రవేత్తలకు వందనం' అనే కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అఖిల భారత శైక్షిక్ మహాసంఘ(ఏబీఆర్ఎసఎమ్), వాయిస్ ఆఫ్ హైదరాబాదీ అకడమిషియన్స్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆపరేషన్ సిందూర్‌లో ప్రత్యక్ష, పరోక్ష పాత్ర పోషించిన రక్షణశాస్త్రవేత్తలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుద్ధక్షేత్రంలో హీరోలు సైనికులైతే, శక్తిమంతమైన యుద్ధ వ్యవస్థలను అభివృద్ధి చేసి సైనికులకందించిన శాస్త్రవేత్తల పాత్ర కీలకమని ప్రశంసించారు. స్వాతంత్ర్య భారత్.. దేశ ప్రయోజనాలకు అనుగుణంగా వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందని, ఈ విషయంలో ఇతరుల జోక్యానికి చోటు లేదన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇతివృత్తంగా మల్లేపల్లి మోహన్ స్వరపరిచిన శౌర్యగీతాన్ని ఆవిష్కరించిన వెంకయ్య.. గీత రచయిత అగరం వసంత్, ఆంగ్ల అనువాదకుడు వంగీపురం శ్రీనివాసాచార్యను అభినందించారు.

### శాస్త్రవేత్తలకు సన్మానం

డీఆర్‌డీవో మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ ఉమ్మాలనేని రాజాబాబు, నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజరీ బోర్డు సభ్యుడు డాక్టర్ జి. సతీషరెడ్డి, తెలంగాణ, ఏపీ సబ్‌ఏరియా మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ డైరెక్టర్ జగన్నాథ నాయక్, ఆకాశ్ మిస్సైల్ ప్రోగ్రాం మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళి, ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్ అజిత్ బి చౌదరి, అస్త్ర మిస్సైల్ సిస్టమ్ మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ పాట్రిక్ డిసిల్వా, అస్త్ర ఫైవ్ ప్రాజెక్టు డైరెక్టర్ నరేంద్ర కాలె, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ పావులూరి సుబ్బారావును సన్మానించారు. కాగా, స్వదేశీ ఆయుధాలను విస్తృతంగా వాడిన తొలి యుద్ధంగా ఆపరేషన్ సిందూర్ నిలుస్తుందని డీఆర్‌డీవో మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ ఉమ్మాలనేని రాజాబాబు అన్నారు. సతీష్ రెడ్డి మార్గదర్శకత్వంలో యాంటీ డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేశామని సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ డైరెక్టర్ జగన్నాథ నాయక్ తెలిపారు. ఇక, ఎంతోమంది సమ్మిళిత కృషితో అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణిలో మొదటి స్వదేశీ సెన్సార్‌ను జగన్నాథ్ నాయక్ అమర్చారని, ఆ సెన్సార్ వల్లే నేడు ఆకాశ్ శక్తిమంతంగా పని చేస్తోందని ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్ అజిత్ బి చౌదరి పేర్కొన్నారు.

# గాంధేయ మార్గంలో 72 గంటలు నిరసన

**నీరు ఎటువంటి ఆహారం లేకుండా బీసీల సంఘటితం**

**ప్రభుత్వం సానుకూల దృక్పథంతో అనుమతులు ఇవ్వాలి**

**కాంగ్రెస్ బిజెపి రెండు తోడు దొంగలు.**

**మీడియా సమావేశంలో జాగృతి వ్యవస్థాపకులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**




**తొవ్వ, ప్రతినిధి. ఆగస్ట్ 03**

గాంధేయ మార్గంలో బీసీ రిజర్వేషన్ బిల్లు కోసం 120పై గ వున్నా బీసీ కులాలు జాగృతం అయి 72 గంటల నిరవధిక నిరసన చేపట్టబోతుందని బిల్ కి మద్దతుగా జాగృతి. యునైటెడ్ పూలే ఫ్రంట్ అండగా నిలబడిందని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు శాసనమండలి సభ్యులు కల్వకుంట్ల కవిత అన్నారు ఆదివారం బంజర హిల్స్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూబీసీ రిజర్వేషన్ ల సాధన కై తెలంగాణ జాగృతి 72 గంటల పాటు రేపటి నుంచి మూడు రోజులు నిరాహార దీక్ష చేస్తుందని సానుకూలంగా మా దీక్షకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలన్నారు..బీసీల్లో 112 కులాలు ఉన్నాయనితమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రతి రోజు 40 కులాలు మాట్లాడే అవకాశం ఉంటుందని అన్ని కులాలు తమ సమస్యలు చెప్పుకునేందుకు కనీసం మూడు రోజులు పడుతుందన్నారు అందుకే తెలంగాణ జాగృతి 72 గంటల పాటు నిరాహార దీక్షకు సిద్ధమవుతుందని గాంధేయ మార్గంలో అన్నం తినకుండా , నీళ్లు తాగకుండా 72 గంటలు దీక్ష చేస్తున్నామని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కాంగ్రెస్, బిజెపి కలిసి నాటకాలు ఆడుతున్నాయని ఆర్డినెన్సు పై బిజెపి స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం లేదన్నారు బిసి రిజర్వేషన్ల పై బిజెపి ధర్నా కామెడీ ధర్నాలా ఉన్నదని దొంగే దొంగ దొంగ అని అరచి నట్టుగా ఉందన్నారు సానుకూల దృక్పథంతో 72 గంటల నిరసనకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాలు యునైటెడ్ ఫ్రంట్ నేతలు బిసి ఉప కులాల నాయకులు పాల్గొన్నారు

# గొల్ల కురుమలు సంఘటితమై ఆర్థిక రాజకీయ రంగాలలో ముందుండాలి

**గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్**

**వెలికట్ట గ్రామంలో జిఎంపిఎస్ సభ్యత్వ నమోదు**



**తొర్రూరు ఆగస్టు 03**

గొల్ల కురుమలు సంఘటితమై రాజకీయ ఆర్థిక రంగాలలో ముందుండాలని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ కోరారు. ఆదివారం మండలంలోని వెలికట్ట గ్రామంలో గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిఎంపిఎస్ సభ్యత్వ నమోదును గ్రామ పెద్ద గొల్ల పోసాని రాములు సొసైటీ అధ్యక్షులు నక్క కొమురెల్లి ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొల్లం అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఇటీవల బ్లూ టంగ్ వ్యాక్సిన్ (నీలి నాలుక) ఉచితంగా వేస్తున్నారని గొర్ల కాపర్లు పశువైద్యంతో మాట్లాడి వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. నేటి గొల్ల కురుమ యువత సంఘటితమై రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయాలని.... గొల్ల కురుమ హక్కుల సాధన కోసం ఉద్యమాలకు కూడా సిద్ధం కావాలని అన్నారు. గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం గొర్ల కాపరుల కోసం నిరంతరం పోరాటం చేస్తూ ఎన్నో హక్కులను సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మనబోయిన యాకయ్య, జిల్లా నాయకులు పోసాని సంతోష్ యాదవ్, ఎద్దు మల్లేష్ యాదవ్, వెలికట్ట గ్రామ యాదవులు యువకులు గొర్ల కాపర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సారు మండల" ప్రగతి"పై దృష్టి పెట్టాలె మీరు!

**నేతల వర్గ పోరా? పునర్విభజనలో మండలం ఉండకపోవడమా**

**ఏమైనా బి సమస్యలు రూపుమాపకుంటే "స్థానిక పోరు"లో అవుతుంది పార్టీ బేజారు**

**తొవ్వ, నెల్లికుదురు, ఆగస్టు 03**

ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్న మండలంలోని గ్రామాలు తండాల్లో సమస్యలు ఎక్కడికి అక్కడే పేరుకుపోయి ఉన్నాయా అనడంలో సందేహం లేదు ప్రధానంగా మండల కేంద్రమైన నెల్లికుదురులో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, గ్రంథాలయ నిర్మాణం, డిగ్రీ కాలేజీ, విశ్రాంతి భవనం పునర్నిర్మాణం తోపాటు , మండలంలో ని రాజుల కొత్తపల్లి, రావిరాల చెరువులు మరమ్మతు చేపట్టకపోవడం, కాచికల్ క్రాస్ రోడ్డు నుంచి మేచరాజు పల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడం, శ్రీరామగిరి శివారు వెంకటాపురం వెళ్లే రోడ్డు వర్షాలకు దెబ్బతిని ఆయా గ్రామాల ప్రజలు సమస్యలు వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. వీటిల్లో ఏ పని పురోగతిలో లేకపోవడంతో గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వ తీరుపైఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటమి రుచి చూపిస్తామని బాహాటంగానే చర్చించుకుంటున్నారు. అంతేకా కుండా అధికార కాంగ్రెస్ పార్టీలో బహు నాయకత్వం ఉండడం వల్లే ఎమ్మెల్యే సమస్యలపై దృష్టి దృష్టి పెట్టలేకపోతున్నారని కొందరు, వచ్చే ఎన్నికల నాటికి పునర్విభజనలో నెల్లికుదురు మహబూబాబాద్ నియోజకవర్గంలో ఉండదు గనుక మండల అభివృద్ధిపై పట్టించుకోవడం లేదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా స్థానిక ఎన్నికలు వచ్చేనాటికి ప్రధాన సమస్యల్లో పురోగతి లేకుంటే కాంగ్రెస్ పార్టీ అధోగతి పాలవుతుందనడంలో సందేహం లేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కేసముద్రం, గూడూరు, మహబూబాబాద్ మండలాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని నెల్లికుదురు మండలంలో అభివృద్ధి ఆనవాళ్లు కూడా లేకపోవడం ఏమిటని కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. ఇప్పటికైనా మండల నేతలు పరస్పర విమర్శలు మాని మండల అభివృద్ధి కమిటీ నిర్మాణం చేసుకొని ఎమ్మెల్యే వద్దఐక్యతారాగం వినిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా మండలంపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతారా అభివృద్ధికి బాటలు వేస్తారా వేచి చూడాల్సిందే.

# విశ్రాంత జీవితం సుఖ సంతోషాలతో గడపాలి

**కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్**




**తొవ్వ, నెల్లికుదురు, ఆగస్టు 03**

ఉద్యోగ విరమణ అనంతరం జీవితాన్ని సుఖ సంతోషాలతో గడపాలని, అదే విధంగా గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ ఆర్టీసీలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన చీమకుర్తి రమేష్ ను కోరారు. ఆదివారం మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో ఏ డి సి గావిధులు నిర్వహిస్తున్న మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన చీమకుర్తి రమేష్ పదవీ విరమణ పొందగా ఆయన కు డిపోలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి హాజరై దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో విలసిల్లాలని అదేవిధంగా సుఖసంతోషాలతో గడవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు ఉద్యోగ జీవితంలో బదిలీలు విరమణలు సహజమన్నారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, పిఎసిఎస్ డైరెక్టర్ బెల్లి నరసయ్య, మద్దెల సమ్మయ్య గౌడ్, తదితరులున్నారు.

# కాంగ్రెస్ పాలనలో పేదల వైద్యానికి పెద్దపీట

## -వీరబోయిన సంపత్ యాదవ్

**బయ్యారం,తొవ్వ,ఆగస్టు 3.**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేసిందనడానికి నూతనంగా రేషన్ కార్డు పొందిన ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ పథకాన్ని సైతం త్వరలో ప్రవేశపెడతామని రాష్ట్ర ప్రభుత్వం తెలపడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరబోయిన సంపత్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి యధావిధిగా ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తామనడం ప్రజా ప్రభుత్వ పాలనకు నిదర్శనమన్నారు. కార్పొరేట్ వైద్యా సదుపాయలు పేదలకు అందించాలనే లక్ష్యంతో ఐదు లక్షల వరకు పరిమితితో ఉన్న ఆరోగ్య శ్రీ పథకాన్ని పది లక్షలకు పెంచిందని,రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదవారు లబ్ది పొందుతారని అన్నారు.నూతన రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ సేవలు కూడా త్వరలో అందుతాయని పేదల వైద్యానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# ఘనంగా డాక్టర్ జ్యోతి పుట్టినరోజు వేడుక



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తొవ్వ ప్రతినిధి: ఆగస్టు 3**

వలిగొండ మండల పరిధిలోని వర్కట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జ్యోతి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం వలిగొండ మండల మాల మహానాడు నాయకులు శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా, మండల అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి, కూచిమల్ల నాగేష్ లు మాట్లాడుతూ... డాక్టర్ జ్యోతి పేద ప్రజల కోసం ఎక్కువ సమయం కేటాయిస్తూ సేవలందిస్తున్నారని కొనియాడారు. ముందు ముందు పేద ప్రజలకు ఇంకా సేవలు అందించాలని, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సీనియర్ నాయకులు రాపోలు పవన్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి కాశమల్ల శేఖర్, కోశాధికారి చలిచీమల కృష్ణ, వెల్వర్తి గ్రామ అధ్యక్షులు కూచిమల్ల కుమార్, ప్రధాన కార్యదర్శి కూచిమల్ల నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యగిరి గుట్ట వద్ద యాచకుడు మృతి

**యాదాద్రి జిల్లా: వలిగొండ: తొవ్వ ప్రతినిధి :ఆగస్టు 3**



వలిగొండ మండల పరిధిలోని మత్స్యగిరి గుట్ట దేవస్థానం దగ్గర యాచకుడు లింగస్వామి వయస్సు 70 సంవత్సరాలు, ఆదివారం ఉదయం 11 గంటల 30 నిమిషాల సమయంలో చనిపోయాడని మత్స్యగిరి గుట్ట దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి పోలీసులకు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా మత్స్యగిరి గుట్ట యాగశాల వద్ద బిక్షమెత్తుకునేవాడని తెలిపారు. మృతునికి పూర్తి వివరాలు తెలియదని పేరు లింగస్వామి ఆలయ సిబ్బంది తెలిపారు. దేవస్థానం చైర్మన్ నరేష్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వలిగొండ ఎస్సై వి యుగేందర్ తెలిపారు.

# ముత్యాలమ్మ గుడి బొడ్రాయి

## బోనాల జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తొవ్వ ప్రతినిధి :ఆగస్టు 3**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ గుడి బోనాల వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలను కలిసి ఆప్యాయంగా పలకరించారు. బొడ్రాయి గ్రామ దేవతల పండుగకు విరాళంగా 10000 రూపాయలు జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి అందజేసినారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు ,మండల నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ నూతన కార్యదర్శిగా ఎన్నికైన దండి.సురేష్‌కు ఘన సన్మానం



**ఖమ్మం రూరల్ తొవ్వ ఆగస్ట్ 3:**
సమాజానికి నిజాలను తెలియజేసే పని జర్నలిస్టులది. ప్రజలకు సమాచారం అందించడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాంటి పాత్రను గౌరవిస్తూ, సీపీఐ పార్టీ నాయకులు, జిల్లా కార్యదర్శి దండి.సురేష్ ను జర్నలిస్టులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమం ఖమ్మం రూరల్ మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా దండి.సురేష్ మాట్లాడుతూ, పత్రికా వర్గం దేశంలో నాల్గవ స్థంభంగా నిలుస్తోంది. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే విశ్వసనీయ వేదిక జర్నలిజం. అలాంటి విలక్షణమైన సేవ చేస్తున్న విలేకరులను గౌరవించటం మా బాధ్యత.”

TUWJ (TJF **నూతన ఎన్నికల సందర్భంగా ప్రత్యేక సమావేశం:**
ఈ కార్యక్రమంలో Telangana Union of Working Journalists (TJF) సంస్థ నిర్వహించిన ఎన్నికల్లో సీపీఐ నూతన కార్యదర్శిగా ఎన్నికైన సురేష్‌ను జర్నలిస్టులు ప్రత్యేకంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులు మాట్లాడుతూ సురేష్ గారు ఎన్నికైనందుకు ఎంతో సంతోషంగా ఉంది. విలేకరుల హక్కుల కోసం ఆయన చేస్తున్న పోరాటం మరింత బలపడాలని ఆశిస్తున్నాం.”ఈ కార్యక్రమంలో వివిధ పత్రికలకు చెందిన విలేఖరులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా జిల్లా %బజీఖీ% అధ్యక్షుడు ఆదినారాయణ మరియు పత్రికా విలేఖరులు మరియు సిపిఐ పార్టీ శ్రేణులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. వీరందరు కలిసి సురేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, జర్నలిస్టు సంఘానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు ప్రభుత్వాన్ని, అధికారులు జర్నలిస్టులపై మరింత ఆదరణ చూపాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న విలేకరులకు సురక్షితమైన వాతావరణం, గుర్తింపు, మరియు ప్రోత్సాహం అవసరమని వారు అభిప్రాయపడ్డారు.

# గిరిజనేతర రైతుల సమస్యలపై భూ భారతి సునీల్‌కు వినతి పత్రం అందజేత

**బయ్యారం,తోవ్వ,ఆగస్టు 3.**
మండలంలోని గిరిజనేతర రైతులు గిరిజన రైతులు అనేక సంవత్సరాల నుండి భూమిని నమ్ముకొని సాగు చేస్తూ జీవనం గడుపుతున్నారు. వారికున్న వనరులు ప్రధాన సమస్య సాగు భూమి, శనివారం భూభారతి ప్రదాత, రైతు సంక్షేమ సంఘం కమిషన్ నాయకులు ఎం.సునీల్ కు రైతు వేదికలో రైతు సాగు యాత్ర లో బాగంగా రైతు సాగు,భూ సమస్యలపై సలహాలు సూచనల అందించారు. ఈ సందర్భంగా మండల రైతులు నాయిని ఇంద్రారెడ్డి,తుమ్మల శ్రీనివాస్,ఈ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న పలు కీలక అంశాలను భూభారతి సునీల్ కు మెమోరాండం ఇచ్చి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియాలో గిరిజనేతరులకు పట్టాలు ఉన్న, సాదా బైనమా ద్వారా పట్టాలు ఇవ్వాలని వారు కోరారు. భూ భారతిలో పట్టాలు ఉన్న రైతులకు పార్టేషన్,సాధాబైనమా ద్వారా గిరిజనేతరులకు నష్టం వాటిల్లే విధంగా ఉన్నట్లు,ఎరువులు తెచ్చుకోవాలన్న పంటలను అమ్ముకోవాలన్న భూమి హక్కు పత్రాలు ఉంటేనే ఈ ప్రాంత సాగు గిరిజన రైతులకు మాత్రమే లాభం చేకూరుతుందని వారి దృష్టికి తీసుకువచ్చారు. అనేక రోజులుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు ఈ ప్రాంత రైతులు గుర్తించినట్లు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సునిల్ రైతులతో మాట్లాడుతూ దీనిపై



భూభారతిలో అనేక కీలక అంశాలను పొందుపరచాల్సి, ఉందని ,గిరిజన,గిరి జనేతర,ఇతరులు రైతులు నష్టపోకుండా సాగు రైతులు నష్టపోకుండా ఈ ప్రాంత ప్రజలకు అసౌకర్యం కలగకుండా భూభారతి సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల వెంకటరెడ్డి,బందెల కళింగ రెడ్డి,హచ్చు మండల ఆదర్శ రైతులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావును కలిసిన బిజెపి మండల నాయకులు

**బయ్యారం,తోవ్వ,ఆగస్టు 3.**
మండల అభివృద్ధి, పార్టీ విస్తరణ,ఇతర పరిస్థితులపై వివరించేందుకు బయ్యారం మండల బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ కోశాధికారి క్రాంతి కుమార్ ఆదివారం తెలంగాణ రాష్ట్ర బిజెపి చీఫ్ రామచంద్రరావును హైదరాబాదులో వారి నివాసంలో కలిసినట్లు ఆదివారం తెలిపారు. .ఈ సందర్భంగా బయ్యారం మండలంలో పార్టీ విస్తరణ గురించి వివరించినట్లు తెలిపారు. పార్టీలో పలు అంశాలను వారి దృష్టికి



తీసుకువెళ్లినట్లు తెలిపారు. వాటిలో బయ్యారం చెరువు,కాలువ మారమ్మతులు, బయ్యారం పెద్ద చెరువు కు సీతారామ ప్రాజెక్టు నీరు తరలించడం, నీటి సమస్యలు, ఏజెన్సీలోని గిరిజనేతర రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించి తమకు చేతనైన సహాయం అందించి మండల అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఆర్టీఐ చట్టంఅధికారులకే చుట్టం

**పలు ఆఫీసుల్లో సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం - నెలలు గడిచినా ఉలుకుపలుకు లేని అధికారులు.**

**ఒకవేళ ఇచ్చినా పొడిపొడి అక్షరాలకే పరిమితం- కొన్ని ప్రశ్నలకు దాటవేత వైఖరే సమాధానం**

**తప్పులు లేనప్పుడు తప్పించుకునే ప్రయత్నాలెందుకో - సమాచారం తెలపడంలో మీనమేషాలు**

**తొవ్వ, ప్రతినిధి, నర్సంపేట, ఆగస్ట్ 03:**
రెండు నెలలు గడిచినా సమాధానం చెప్పలేని అధికారులుఆర్టీఐ చట్టం.. అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తుందనేది మాటలకే పరిమితమవుతున్నదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. కొన్ని కార్యాలయాల్లో అధికారుల తీరుతో ఈ చట్టం నిర్వీర్యమవుతున్నదనే సందేహాలు రేకెత్తుతున్నాయి. కొందరు అధికారులు అడిగిన సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తుంటే.. మరికొందరు తప్పించుకునే ప్రయత్నాలుగా అరకొరగా సమాధానాలు చెబుతుండడం.. చట్టం.. అధికారులకు చుట్టంగా మారిందా? అనే అపోహలు తలెత్తుతున్నాయి. సమాచారం కోరుతూ రెండు నెలల క్రితం ఆర్టీఐ చట్టం కింద పెట్టుకున్న అర్జీకి ఇప్పటివరకు సమాధానం ఇవ్వకపోవడం చట్టంపై అధికారులకున్న నిబద్ధత ఏపాటిదో అర్థమవుతోంది. నిబంధనల ప్రకారం 30రోజుల్లో ఏ అర్జీకైనా సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కానీ, అధికారులు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అయితే, ఒక వ్యక్తి మొదటి సారి చేసుకున్న అర్జీకి సమాధానం రాకపోతే.. అదే దరఖాస్తును మరో రెండు సార్లు చేసుకుని, అప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి జవాబు రాకపోతే.. అర్జీదారుడు అధికారులపై కేసు పెట్టుకునే అవకాశం ఉంది. ఈ లొసుగును అడ్డం పెట్టుకుని అధికారులు మూడోసారి దరఖాస్తు చేసుకునే వరకు వేచిచూద్దామనే ధోరణి అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులమనే అహంకారమా?ప్రభుత్వ అధికారుల నుంచే సమాధానం కోరడమంటే ఇప్పటికి కొంతమంది అధికారులకు మింగుపడని వ్యవహారంగానే మారినట్లు తెలుస్తోంది. పైఅధికారులు అడిగితే సమాధానం చెప్పాలి.. అలాగే సామాన్య ప్రజలు అడిగినా సమాధానం ఇవ్వాలా? అనే అహంకారంలో కొంతమంది అధికారులు ఆర్టీఐ అర్జీలపై అలసత్వంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. అందుకే ఒకసారి చేసుకున్న అర్జీని పట్టించుకోకుండా మరో రెండు అవకాశాలు ఉన్నాయనే కోణంలో అర్జీలను బుట్టదాఖలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పొడిపొడి అక్షరాలే.కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి కూడా అధికారులు నిరాకరిస్తున్నారు. ఈ ప్రశ్నకు సమాచారం ఇవ్వలేము, ఆ అధికారం తమకు లేదు.. అంటూ కొందరు అధికారులు పొడిపొడిగా సమాధానాలు ఇస్తున్నారు. అసలు ఆప్రశ్నలకుసమాచారంఇవ్వకపోవడానికి గల కారణాలేమిటో చెప్పకుండాతూ తూమంత్రంగా సమాధానాలు ఇస్తూ చేతులు దులుపుకుం టున్నారు అని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

# అసలు బీఆర్ఎస్లో ఈ లిల్లీపుట్ లీడర్ ఎవరు

## ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ నేతల తీరుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఇంటి ఆడబిడ్డపై వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ సోదరులు ఎవరూ మాట్లాడలేదు అని తీవ్ర స్థాయిలో ఆవేదన చెందారు. తన మీద వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్లోని పెద్ద నాయకుడి కుట్ర ఉందని సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు.. నల్లగొండలోని ఓ బీఆర్ఎస్ నాయకుడు ఎగిరెగిరి పడుతున్నారని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండలో ఆయన ఒక్కడు గెలిచి మిగిలిన సీట్ల ఓటమికి కారణమయ్యాడని మండిపడ్డారు. అలాంటి లిల్లీపుట్ నేత కూడా నా మీద మాట్లాడుతన్నాడని సీరియస్ అయ్యారు. అసలు కేసీఆర్ లేకపోతే ఆ లిల్లీపుట్ లీడర్ ఎవరు? అని ప్రశ్నించారు. కాగా, ఇటీవల ఓ మీడియా ఛానల్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్లో కవిత పరిస్థితి ఏంటని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు జగదీష్ రెడ్డి షాకింగ్ ఆన్సర్ ఇచ్చారు. కవిత గురించి మాట్లాడటానికి ఏం

# ప్రమాదవశాత్తు గోడకూలి వ్యక్తి మృతి

## -కేసు నమోదు చేసిన ఎస్.ఐ తిరుపతి

**బయ్యారం,తోవ్వ,ఆగస్టు 3.**



బయ్యారం మండలంలో వెంకట్రాంపురం గ్రామపంచాయతీ పరిధిలో ప్రమాదవశాత్తు గోడ కూలి మునగాల జంపన్న(49) ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో శిథిలావస్థలో ఉన్న గోడను డ్రిల్లింగ్ మిషన్ తో తొలగించే సందర్భంలో గోడ జంపన్న పై పడడంతో మృత్యువాత పడినట్లు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# చికిత్స పొందుతూ మహిళా మృతి

**తొవ్వ, నెల్లికుదురు, ఆగస్టు 03**



మండలంలోని మునిగలవిడు గ్రామంలో ఇటీవలే అతివేగం వల్ల ఆటో అదుపుతప్పి గ్రామ సమీపంలోని బావిలో పడి అదే గ్రామానికి చెందినశ్రీరాం నరసయ్య మృతి చెంది అతని భార్య భారతమ్మ తీవ్రంగా గాయపడడంతో వరంగల్ లోని ఎంజీఎం కు చికిత్స నిమిత్తం తరలించి వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో ఆరోగ్యం విషమించి ఆదివారం మృతి చెందినట్లు స్థానిక ఎస్సై చిర్రా రమేష్ బాబు తెలిపారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా మృతిపై గ్రామస్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బంధువులుప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# గౌడ జర్నలిస్టులకు సన్మానం




**తొవ్వ, ప్రతినిధి, నర్సంపేట, ఆగస్టు, 03**
నర్సంపేట పట్టణంలోని ఎస్సార్ కాలేజీ ఆవరణలో గౌడఅఫీషియల్ అండ్ప్రొఫెషనల్స్ (గోపా )ఆధ్వర్యంలో ఇటీవల ఎలక్ట్రానిక్ మీడియాలో ఏకగ్రీవంగా ఎన్నికైన గౌరవ అధ్యక్షులు పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షులు గొడిశాల సదానందం గౌడ్ ముఖ్య సలహాదారులు వడ్లకొండ రాజ గౌడ్ సహాయ కార్యదర్శి గోపగాని శోభన్ గౌడ్ లకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గోప అసోసియేట్ అధ్యక్షులు రామగోని సుధాకర్ గౌడ్ గౌడ వెల్ఫేర్ అధ్యక్షులు గండు లింగయ్య గౌడ్ఇంటర్నేషనల్ వాకర్ అసోసియేషన్ గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు విజయ్ కుమార్ గౌడ్,తెలంగాణ కల్లుగీత వృత్తిదారుల సంఘం నర్సంపేట డివిజన్ అధ్యక్షులు తాళ్లపల్లి చంద్రమౌళి గౌడ్, కొయ్యడు సనత్, గొడిశాల గిరి గౌడ్ పాల్గొన్నారు.

# ఘనంగా ఫ్రెండ్షిప్ డే ఉత్సాహలు



**తొవ్వ, ప్రతినిధి, నర్సంపేట, ఆగస్టు, 03:**
నర్సంపేటనగరంలో ఈరోజు స్వచ్ఛంద సంస్థల మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఫ్రెండ్షిప్ డే ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ ప్రపంచంలో ధనం కన్నా స్నేహం ఎంతో విలువైనదని కేవలం తల్లిదండ్రులు జన్మనిచ్చిన తోటి వారితో సమానం కంటే ఎక్కువగాతనలోఉండబడినటువంటి అన్ని రకాల భావజాలను వదులుకొని స్నేహానికి కట్టుబడి చివరి క్షణం వరకు స్నేహమేరా జీవితం అంటూ కొనసాగే వాడి మిత్రుడని కొనియాడారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల నుండి పాక ప్రవీణ్ గారు మాట్లాడుతూ ఫ్రెండ్షిప్ డే ను అందరితో చేసుకోవడం సంతోషంగా ఉందని ఈ యొక్క కార్యక్రమానికి లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకులు రవికుమార్ గారు మరియు ఏ7 న్యూస్ రిపోర్టర్ జన్ను శ్రీనివాస్, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆకలి తీర్చిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

**మొట్లగూడెం విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సరిపడ బియ్యం నిత్యవసర వస్తువులు అందించిన బయ్యారం సింగిల్ విండో చైర్మన్**

**బయ్యారం, ఆగస్టు 3**
మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం మోట్లగూడెం ప్రభుత్వ పాఠశాల నూతనంగా ప్రారంభం కావడంతో మధ్యాహ్నం భోజనం అమలు కాక విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారని స్థానికులు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బయ్యారం మండల పిఎసిఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి పర్యటించి ఈరోజు గ్రామస్తుల సమక్షంలో మోట్లగూడెం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనానికి సరిపడ బియ్యం నిత్యవసర వస్తువులను అందించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ, 2003 లో ఐటిడి ద్వారా ఆ పాఠశాల నిర్మాణం జరిగిందని ఆ తర్వాత మండల పరిషత్తుకు అప్పగించడం జరిగిందని పాఠశాలలో విద్యార్థుల కొరతతో పాఠశాల మూత పడిందని తెలిపారు. దీంతో మోట్లగూడెం గ్రామస్తులు మరియు ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు రాజు మూతబడిన ప్రభుత్వ పాఠశాలను మరల పునరుద్ధరించాలని ఎమ్మెల్యేను తెలియజేయడంతో వారు వెంటనే స్పందించి ప్రభుత్వ పాఠశాలను పునరుద్ధరించడం జరిగిందని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా ప్రారంభించిన



పాఠశాలలో సాంకేతిక లోపంతో మధ్యాహ్న భోజనం పథకం అమలు కాకపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతులు నానా అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే తెలుసుకొని ఆ విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం నిత్యవసర వస్తువులు అందించాలని బయ్యారం సింగిల్ విండో చైర్మన్ మూల మధుకర్ రెడ్డి తెలియజేయడంతో వారు ఈ రోజు గ్రామాన్ని సందర్శించి వారి సమక్షంలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించారు. మధ్యాహ్న భోజన సామాగ్రి అందుకున్న విద్యార్థులు ఆనందంతో ఎమ్మెల్యే, సొసైటీ చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాఠశాల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్గనైజేషన్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఏర్పాటు

**- విద్య,ఆరోగ్యం,ఉపాధి పై సంస్థ పనిచేస్తుంది - తెలంగాణ ఉద్యమకారుడు,కూడా మాజీ చైర్మన్ సుందర్రాజు యాదవ్**



**హన్మకొండ,ఆగస్టు 3**
కన్మకొండ రాంనగర్ లోని బీసీ భవన్ లో జరిగిన సమావేశంలో బీసీలలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటి వెలికి తీయాలని కంకణం కట్టుకొని ఆర్గనైజేషన్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఏర్పాటు చేసాము ఇది విద్య,ఆరోగ్యం,ఉపాధి పై సంస్థ పనిచేస్తుంది. ఇది ఆరంభం మాత్రమే బీసీలలో ప్రతి కులాన్ని పైకి తీసుకొచ్చే విధంగా మా కార్యచరణ ఉండబోతుంది. హనుమకొండ రామ్ నగర్ లో బీసీ భవన్ లో మొదటి కార్యవర్గ సమావేశం జరిగింది. అతి త్వరలో ఈ ఆర్గనైజేషన్ కి ఓపెనింగ్ సెర్మనీ కూడా పెట్టుకోబోతున్నాం ఈ సమావేశం లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయాలని అంతేకాకుండా హెల్త్ క్యాంప్ లు మరియు ఎడ్యుకేషన్ మీద అవగాహన సదస్సులు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా వారికి ట్రైనింగ్ సదస్సులు చేయాలని సుందర్ రాజ్ యాదవ్ అధ్యక్షతన నిర్ణయాలు తీసుకున్నాము. ఈ సందర్భంగా సుందర్రాజు యాదవ్ మాట్లాడుతూ బీసీలలో చాలా వెనుకబడిన కులాలు అట్టడుగు స్థాయిలో ఉన్నాయి . ఆ కులాలను చూస్తే కళ్ళకు నీళ్లు వస్తా ఉంటాయి. రానున్న కాలం బీసీలదే వాళ్లను ఎడ్యుకేట్ చేయడమే మా మొదటి స్టెప్ గా మేము భావిస్తున్నాం రానున్న కాలంలో బీసీల కోసం మరిన్ని కార్యక్రమాలు చేసి బిసి అభ్యున్నతికి పాటుపడతామని తెలియజేశారు..ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గడ్డం బాస్కర,ప్రొఫెసర్ విజయ్ బాబు జనార్ధన్, బండ వివేకానంద,గంగా పురం వేణుమాధవ్, రవీంద్ర, డా రాము, ఐటి, రాజేష్, విజయ్ కుమార్ మూర్తి, మోహన్, డా విజయలక్ష్మి, డా స్వామి రాములు ప్రొఫెసర్ శ్రవణ,గారులు మిత్రబృందం పాల్గొన్నారు.

# ఉత్తరప్రదేశ్‌లో వరదలు..

**- రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేని వానలు.. 17 జిల్లాలు జలమయం - ప్రమాద స్థాయిని దాటిప్రవహిస్తున్న పలు నదులు**

**- నీట మునిగిన వందలాది గ్రామాలు - ప్రయాగ్‌రాజ్‌లో 15 వేల ఇళ్లలోకి నీరు - కొనసాగుతున్న సహాయక చర్యలు**





**లఖ్‌నవూ, ఆగస్టు 3:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాలను వరదలు ముంచెత్తాయి. వందలాది గ్రామా లు, కొన్ని నగరాలు పూర్తిగా నీట మునిగాయి. జన జీవనం స్తంభించిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, సహాయక సిబ్బంది రంగంలోకి దిగి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాన్పూర్‌నగర్, లఖింపూర్ ఖేరీ, ఆగ్రా, ఔరారియా, చిత్రకూట్, బల్లియా, బండా, ఘాజీపూర్, మీర్జాపూర్, ప్రయాగ్‌రాజ్, వారాణసీ, చందౌలీ సహా 17 జిల్లాలను వరదలు ప్రభావితం చేశాయి. గంగా, యమునా, రామగంగా, గోమతి సహా పలు నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్, వారాణసీ నగరాలు పూర్తిగా నీట మునిగాయి. ఒక్క ప్రయాగ్‌రాజ్‌లోనే 15 వేల ఇళ్లలోకి వరద నీరు చేరింది. పలు ప్రాంతాల్లో పీకల్లోతు వరద నీటిలో సురక్షిత ప్రాంతాలకు చేరేందుకు అక్కడి జనం పడుతున్న ఇబ్బందుల తాలుకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'వరదలతో 37 తహసీళ్లలోని 402 గ్రామాలకు చెందిన 84,392 మంది ప్రజలు ప్రభావితమయ్యారు. 47 వేలకు పైగా మందికి తక్షణ సాయం అందించాం. క్షేత్రస్థాయిలో సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. 493 పడవలు, బోట్ల ద్వారా ఆహారం ప్యాకెట్లు, అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తున్నాం' అని విపత్తు నిర్వహణ కమిషనర్ భానుచంద్ర గోస్వామి ఓ ప్రకనటలో తెలిపారు. మంత్రి స్వతంత్రదేవ్ సింగ్ హమీర్‌పూర్‌లోని వర ద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. సహాయక శిబిరాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఇక రాబోయే 24 గంట ల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. వరదల నేపథ్యంలో సర్కారుపై ప్రతిపక్ష నేత, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టును బీజేపీ అపహాస్యం చేసిందని విమర్శించారు. 'ప్రయాగ్‌రాజ్‌లో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినా అక్కడి ప్రజలకు వరద ముంపు కష్టాలు తప్పలేదు. బీజేపీ నేతల అవినీతిని అక్కడి నీటి గుంతలే స్పష్టం చేస్తున్నాయి. స్మార్ట్ సిటీ భావనపై నీళ్లు చల్లిన కాషాయ పార్టీ నేతలు తమ పడవల్లో ఎక్కడికో అదృశ్యమయ్యారు?' అంటూ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు.

# స్కానింగ్ కేంద్రాలపై పర్యవేక్షణేది?

**తూతూ మంత్రంగా పీసీపీఎన్‌డీటీ తనిఖీలు**

**సంఘటనలు జరిగితేనే హడావుడి.. రాష్ట్రంలో 4,180 కేంద్రాలు**

**వీటిలో నెలకు 10 శాతం కేంద్రాల్లో కూడా తనిఖీలు జరగట్లే**

**యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు చేసేస్తున్న వైనం**

**కేంద్రాల్లో అనుమతుల్లేకుండానే స్కానింగ్ యంత్రాలు**

**హైదరాబాద్, ఆగస్టు 3:** రాష్ట్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆస్పత్రుల్లో అనుమతుల్లేకుండా అల్ట్రాస్కానింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తూ.. ఇష్టారాజ్యంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్కానింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అదే సమయంలో.. స్కానింగ్ కేంద్రాలపై పర్యవేక్షణకు ఉద్దేశించిన పీకాన్సెప్షన్ ప్రీనాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్(పీసీపీఎన్‌డీటీ) చట్టం–1994 పకడ్బందీగా అమలు కావడంలేదనే విమర్శలున్నాయి. జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో.. ఫర్టిలిటీ, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా 4,180 కేంద్రాలు**
తెలంగాణ వ్యాప్తంగా పీసీపీఎన్‌డీ చట్టం కింద అనుమతి పొందిన ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలు 4,180 వరకు ఉన్నాయి. వీటిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి. నెలకు సగటున 33్న కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలి. అంటే.. ప్రతి కేంద్రాన్ని మూణ్నెల్లకోసారి తనిఖీ చేయాల్సి ఉన్నా..10్న కేంద్రాల్లో కూడా తనిఖీలు జరగడం లేదని వైద్య ఆరోగ్యశాఖ తాజాగా నిర్వహించిన సమీక్షలో వెల్లడైంది. మే నెలలో 1,392 కేంద్రాల్లో తనిఖీలు చేయాలని టార్గెట్ విధిస్తే కేవలం 422 కేంద్రాల్లో ఇన్‌స్పెక్షన్లు మాత్రమే నమోదయ్యాయి. జూన్ నెలలో 533 కేంద్రాలను సందర్శించారని వైద్య ఆరోగ్య శాఖ తాజాగా సర్కారుకు అందజేసిన నివేదిక స్పష్టం చేస్తోంది.

**గ్రేటర్ హైదరాబాద్‌లో 57% కేంద్రాలు**
రాష్ట్రంలోని స్కానింగ్ కేంద్రాల్లో 57% గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో 908, రంగారెడ్డిలో 609, మేడ్చల్‌లో



872 కేంద్రాలున్నాయి. ఆ తర్వాత అత్యధిక కేంద్రాలున్న జాబితాలో హనుమకొండ (179), కరీంనగర్ (145), ఖమ్మం (104), సంగారెడ్డి (128), నిజామాబాద్ (126) జిల్లాలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో 797 కేంద్రాలు తనిఖీ చేయాల్సి ఉన్నా.. 124 మాత్రమే చేస్తు న్నారు. ములుగు, మెదక్, హనుమకొండ, నాగర్‌కర్నూల్, భూపాలపల్లి జిల్లాల్లోనే పీసీపీఎన్‌డీటీ తనిఖీలు లక్ష్యాలకనుగుణంగా కొనసాగుతున్నాయి.

**ఫర్టిలిటీ, సరోగసి పేరుతో మోసం**
ఫర్టిలిటీ, సరోగసి పేరుతో సంతాన సాఫల్య కేంద్రాల మోసాలు తీవ్రమవుతున్నాయని వైద్యవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సంతానం కోసం వచ్చే దంపతుల శరీర ఛాయ ఆధారంగా వారికి పుట్టబోయే బిడ్డలు కూడా అదే రంగులో ఉండేలా కొన్ని కేంద్రాలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. అందుకోసం నలుపు, ఎరుపు, బ్రౌన్ రంగుల వ్యక్తుల వీర్యకణాలను సేకరించి పెట్టుకుంటున్నాయని తెలిపాయి. సరోగసి ప్రసవాలు కూడా పెరుగుతున్నట్లు వివరిస్తున్నాయి. అధికారికంగా 50 వరకు సరోగసి అనుమతులు ఉంటుండగా.. అనధికారికంగా వీటి సంఖ్య వెయ్యికిపైగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ట్రాక్టర్

**పలువురికి గాయాలు**



**ప్రజా వాయిస్,ఆగస్టు 3**
కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టిసి బస్సు ను ట్రాక్టర్ ఢీ కొట్టిందని ఘటనలో పలువురికి గాయాలు అయినట్టు గర్గుల్ గ్రామస్తులు తెలిపారు. కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కామారెడ్డి నుండి అన్నారం వెళ్తుండగా గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బస్సును ఢీకొంది. ట్రాక్టర్ ఢీకొనటం తో బస్సు ముందు భాగం డ్యామేజ్ అయింది. బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. అన్నారం గ్రామానికి చెందిన పద్మ, తిమ్మక పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ, రామారెడ్డి గ్రామానికి చెందిన మాధవి, సయ్యద్ బి లకు గాయాలయ్యాయి. గాయపడిన మహిళలను కామారెడ్డి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కు ట్రీట్మెంట్ కోసం తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని దేవునిపల్లి పోలీసులు పేర్కొన్నారు.


# హైస్పీడ్‌లో.. ఎలక్ట్రిక్ వాహనాలు

**రాష్ట్రంలో పెరిగిన కార్లు, ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు**

**రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపుతో ఊతం**

**నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటంతో ఆ వైపు మొగ్గు**

**ఏడు నెలల్లో రోడ్డెక్కిన కొత్త ఎలక్ట్రిక్ వాహనాలు 50 వేలు**



**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3:** రాష్ట్ర రోడ్లపై విద్యుత్ వాహనాలు రయ్యిన దూసుకెళుతున్నాయి. విద్యుత్ వాహనాల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఎలక్ట్రిక్ కార్లు కొనేవారి సంఖ్య ఏటేటా పెరుగుతున్నట్టు రవాణా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు కూడా అంతకంతకు దూసుకెళుతున్నాయి. గత ఏడు నెలల్లో రాష్ట్రంలో 50 వేలకుపైగా విద్యుత్ వాహనాలు కొత్తగా రోడ్డెక్కాయి. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం మినహాయించడంతో కొనుగోళ్లు పెరుగుతున్నాయని.. ఇప్పటివరకు రూ.369.27 కోట్ల మేర పన్ను మినహాయింపు లభించిందని రవాణాశాఖ వర్గాలు తెలిపాయి.

**పన్ను మినహాయింపులతో తగ్గిన 'ఆన్ రోడ్' ధరలు**
పర్యావరణహిత హైదరాబాద్ లక్ష్యంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ రుసుము మినహాయింపు నిర్ణయం తీసుకుంది. 2024 నవంబరు 16వ తేదీ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. దీనితో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల్లో పెరుగుదల కనిపిస్తోంది. సాధారణంగా కేటగిరీని బట్టి వాహనం ధరలో 12 శాతం నుంచి 20 శాతం వరకు రోడ్ ట్యాక్స్ (లైఫ్ ట్యాక్స్)గా చెల్లించాలి. వాణిజ్యేతర వాహన కేటగిరీలో ఎక్స్ షోరూం ధర రూ.5లక్షల్లోపు ఉన్న కార్లకు రోడ్ ట్యాక్స్ 13 శాతం, రూ5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ధర ఉంటే 14 శాతం, రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల్లోపు వాహనాలకు 17 శాతం, రూ.20 లక్షల కంటే ఎక్కువ ధర ఉండే వాహనాలకు 18 శాతం రోడ్ ట్యాక్స్ వసూలు చేస్తారు. తాత్కాలిక, శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం కార్లకు రూ.2500 నుంచి రూ.5 వేల వరకు.. ద్విచక్ర వాహనాలకు రూ.500–800 వరకు చార్జీ ఉంటుంది. ఈ క్రమంలో రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీల మినహాయింపుతో.. ఒక్కో కారుపై కనిష్టంగా రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు 'ఆన్ రోడ్' ధర తగ్గుతోంది. కొత్త సాంకేతికతలతో వస్తున్న విద్యుత్ వాహనాల మైలేజీ ఎక్కువగా ఉంటోంది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 250 కిలోమీటర్ల నుంచి 600 కిలోమీటర్ల వరకు ప్రయాణించే కార్లు.. 40 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల వరకు ప్రయాణించగల ద్విచక్రవాహనాలు అందుబాటులోకి వచ్చాయి. విద్యుత్ చార్జింగ్‌తో నడవడం, ఇతర నిర్వహణ వ్యయాలు పెద్దగా ఉండకపోవడం కూడా ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరగడానికి కారణమవుతోంది.

**50 వేల వాహనాలు.. 369.27 కోట్ల మినహాయింపు..**
నవంబరు 16 నుంచి జూన్ 30 వరకు ఏడున్నర నెలల్లో రాష్ట్రంలో అన్ని కేటగిరీల విద్యుత్ వాహనాలు కలిపి 50 వేలకుపైగా రిజిస్ట్రేషన్ జరిగాయి. వీటన్నింటికీ కలిపి రూ.369.27 కోట్ల మేర పన్ను మినహాయింపు లభించింది. అందులో 9,058 వ్యక్తిగత (నాన్ ట్రాన్స్‌పోర్ట్) విద్యుత్ కార్లకు సంబంధించి రూ.302.12 కోట్ల పన్ను, రుసుముల మినహాయింపు లభించింది. ఇది మొత్తం మినహాయింపులలో 82 శాతం కావడం గమనార్హం. '2017 నుంచి 2024 వరకు ఈ స్థాయిలో విద్యుత్ కార్ల రిజిస్ట్రేషన్ జరగడం ఇదే ప్రథమం. అది కూడా ఏడు నెలల్లోనే జరిగాయి' అని రవాణా శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఇక 37 వేల విద్యుత్ ద్విచక్ర వాహనాలకు సంబంధించి రూ.43.82 కోట్లు పన్ను, రుసుము మినహాయింపు దక్కింది. వాణిజ్య పరంగా వినియోగించే విద్యుత్ కార్లు, ఆటోలు, సరుకు రవాణా వాహనాలు, బస్సుల రిజిస్ట్రేషన్లు కూడా గతంతో పోలిస్తే పెరిగాయి.

# కాళేశ్వరంపై సిట్?

**(మొదటిపేజీ తరువాయి)**

తెలంగాణ ఏర్పాటయ్యాక ఇలా ఒకే అంశం ఎజెండాగా క్యాబినెట్ భేటీ కావడం ఇదే మొదటిసారి. ఈ వ్యవహారాన్ని సర్కారు ఎంత తీవ్రంగా పరిగణిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి ఏపీలోనూ ఒకే ఎజెండాపై క్యాబినెట్ భేటీ జరిగిన దాఖలాలు పెద్దగా లేవు. అలాగే ఇదే అంశంపై శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఈ భేటీలో నిర్ణయిస్తే.. అలా ఒకే అంశంపై అసెంబ్లీ నిర్వహించడం కూడా తొలిసారి అవుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం**

**కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చించే అవకాశం**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకతలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై ఈ సమావేశంలో చర్చిస్తారు. తదుపరి కార్యాచరణను సిద్ధం చేస్తారు. మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో సమావేశమై క్యాబినెట్ నోట్ తయారీపై చర్చించారు. నివేదికపై అధ్యయనం చ్జేసందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ సూచనలపై క్యాబినెట్ సమావేశంలో చర్చిస్తారు. బాధ్యులపై ఏసీబీతో అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరిపించాలా లేక సిట్ ఏర్పాటు చేయాలా అనే అంశాలను మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.



# దిండు మారితే కలత నిద్రే..

శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఎక్కడికెళ్లినా తనతోపాటు ఓ దిండుని కూడా తీసుకెళ్తుంటారు. ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారిన సందర్భాలు చాలా ఉన్నాయి. అసలు జాన్వీ తనతోపాటు దిండును తీసుకెళ్లడానికి ఏమైనా ప్రత్యేకమైన కారణాలున్నాయా? అనే అంశంపై పలు కథనాలు కూడా వెలువడ్డాయి. రీసెంట్‌గా ఈ విషయంపై జాన్వీ స్పందించారు. 'నాకు పిల్లో ఫోబియో ఉంది. నా షూటింగులు రకరకాల ప్రదేశాల్లో జరుగుతుంటాయి. ఒక్కోసారి నైట్ అక్కడే స్టే చేయాల్సొస్తుంది. అలాంటి సందర్భాల్లో ఏ దిండు పడితే ఆ దిండును తలకింద వేసుకొని పడుకోలేను. కేవలం నా దిండుపై పడుకుంటేనే నాకు నిద్ర వస్తుంది. దిండు మారితే ఇక ఆ రాత్రంతా కలత నిద్రే. అందుకే తోడుగా దిండు తీసుకెళ్తుంటా. ఈ ఫోబియా నా చిన్నప్పట్నుంచీ ఉంది. ఇందులోంచి బయట పడేందుకు చాలాసార్లు ప్రయత్నించా. ప్రయత్నించిన ప్రతిసారీ నిద్రకు దూరమయ్యా.' అంటూ వాపోయారు జాన్వీ కపూర్. ఇక ఈ స్టేట్‌మెంట్ విన్న నెటిజన్లు.. 'కొత్త దిండు కొనుక్కోవచ్చుగా?', 'నీ ప్రొడ్యూసర్లు కొత్త దిండ్లు కూడా కొనలేరా?' అంటూ కామెంట్లు పెట్టేస్తున్నారు.

# 'దేవర 2' మొదలయ్యేది అప్పుడే?



ఈ నెల 14న 'వార్ 2'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు తారక్. బాలీవుడ్‌లో ఆయన చేసిన తొలి సినిమా ఇదే కాగా, తెలుగులోనూ ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. ఇక ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్) షూటింగ్‌లో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. ఈ సినిమాను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలనే గట్టి తలంపుతో ఉన్నారాయన. ఈ సినిమా తర్వాత ఆలస్యం చేయకుండా 'దేవర 2' సెట్‌లోకి ఎంట్రీ ఇస్తారట తారక్. ప్రస్తుతం 'దేవర 2' ప్రీ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతున్నది. అంతా అనుకున్నట్టు జరిగితే వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలుపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు దర్శకుడు కొరటాల శివ. 'దేవర'కు సీక్వెల్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాలో తొలి భాగంలో తలెత్తిన ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరకనున్నాయి. జాన్వీ కపూర్ పాత్ర కూడా 'దేవర 2'లో చాలా కీలకంగా ఉంటుందని తెలుస్తున్నది. 2027 సంక్రాంతి కానుకగా 'దేవర 2'ను విడుదల చేయాలని నిర్మాతలు కల్యాణ్‌రామ్, మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరి భావిస్తున్నారని సమాచారం.

# రేవంత్ రెడ్డితో చిరు భేటీపై జోరుగా చర్చలు

## సడెన్‌గా కలవడం వెనక కారణం?



ఆదివారం సాయంత్రం, జూబ్లీహిల్స్‌లోని సీఎం అధికార నివాసంలో మెగాస్టార్ చిరంజీవి.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం చిరంజీవిని పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. వీరి మధ్య కొంతసేపు వ్యక్తిగత విషయాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. అయితే ఈ సడెన్ మీటింగ్‌కి సంబంధించిన గల కారణాలు అధికారికంగా వెలువడలేదు. ఇంతలోనే టాలీవుడ్‌లో ఓ సంచలన పరిణామం చోటు చేసుకుంది. 24 క్రాఫ్ట్‌లకి ప్రాతినిధ్యం వహించే తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ షూటింగ్‌ల బంద్‌కు పిలుపునిచ్చింది. తమ వేతనాలను 30శాతం పెంచాలని కోరిన కార్మిక సంఘాల డిమాండ్లను ఫిల్మ్ ఛాంబర్ అంగీకరించకపోవడంతో, ఆదివారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీనితో ఫెడరేషన్ షూటింగ్‌లను నిలిపివేయాలని నిర్ణయించింది. 30శాతం పెంపుతో లేఖ ఇచ్చిన నిర్మాతల చిత్రాలకే కార్మికులు పని చేయనున్నట్టు స్పష్టం చేసింది. ఈ కీలక సందర్భంలో చిరంజీవి సీఎం రేవంత్ రెడ్డిని కలవడం పలు ఊహాగానాలకు దారి తీసింది. అయితే ఈ మీటింగ్‌కి షూటింగ్ బంద్‌కి సంబంధించిన అంశాలు సంబంధం లేదని తెలుస్తోంది. చిరంజీవి ఈ నెల 22న తన 70వ పుట్టినరోజు జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఏదైనా ప్రత్యేక వేడుక జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఆయన సీఎం ని కలిశారా? లేదా రాజకీయంగా మరే అంశంపై చర్చించారా? అన్నది ఇప్పటివరకు స్పష్టత రాలేదు. అయితే, ఈ భేటీపై ఇండస్ట్రీలో, రాజకీయ వర్గాల్లో చర్చలు జోరుగా సాగుతున్నాయి.ప్రస్తుతం చిరంజీవి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. వశిష్ఠ దర్శకత్వంలో వస్తున్న "విశ్వంభర" సినిమా షూటింగ్ దాదాపు పూర్తి కాగా, ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం విడుదలయ్యే అవకాశముంది. మరోవైపు, అనిల్ రావిపూడి దర్శకత్వంలో "మెగా 157" అనే సినిమా కూడా చేస్తున్నారు. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా, చిరంజీవి మార్క్ యాక్షన్, అనిల్ మార్క్ వినోదంతో సంక్రాంతి 2026 విడుదలగా ప్లాన్ చేస్తున్నారు. ఈ మూవీపై అంచనాలు భారీగా ఉన్నాయి.



# అందరు యాక్టర్లతో కలిసి కనిపిస్తా..

## రజినీకాంత్ కూలీపై శృతిహాసన్ ఇంకా ఏమన్నదంటే..?

లోకేశ్ కనగరాజ్ నుంచి సినిమా వస్తుందంటే అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ డైరెక్టర్ తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ తో తెరకెక్కిస్తున్న చిత్రం కూలీ. ఈ చిత్రాన్ని ఆగస్టు 14న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కాగా శృతిహాసన్ కూలీ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుందని తెలిసిందే. ఈ మూవీలో తన పాత్ర గురించి కొన్ని విషయాలు షేర్ చేసింది శృతి హాసన్. కూలీలో నా పాత్ర అందరూ యాక్టర్లతో కలిసి సాగుతుంది. చాలా మంది స్టార్లున్న సినిమాలో భాగం కావడం, వారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా థ్రిల్లింగ్‌గా ఉందని చెప్పింది. అంతేకాదు కూలీ ఆసక్తికర కథనంపై ప్రశంసలు కురిపించింది. హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన కథలో కీలకంగా సాగేలా ఉండబోతుందన్నది. ఇక లోకేశ్ కనగరాజ్ ఇంటెన్స్ స్టోరీ టెల్లింగ్, తలైవా స్క్రీన్ ప్రెజెంటేషన్ కూలీని బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా నిలుపబోతున్నాయని ఇప్పటివరకు వచ్చిన అప్‌డేట్స్ చెబుతున్నాయి. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్‌కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146